

గజ్వేల్‌లోని జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ(ఫైల్)

# తెల్లబంగారం.. కొనుగోళ్ల జోరు

- సిద్దిపేట జిల్లాలో 1.08 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- 22 సీసీఐ కేంద్రాల్లో 1.65లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు
- ప్రభుత్వ మద్దతు ధర రూ.7020
- గజ్వేల్ పరిధిలో ఆరు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు
- సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర దక్కక రైతుల ఇక్కట్లు
- వ్యాపారుల వైపు మొగ్గుచూపుతున్న కర్షకులు

గజ్వేల్, డిసెంబర్ 10: పత్తి పంటను విక్రయించేందుకు జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకూడదనే ఉద్దేశంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆశించిన ధర దక్కక రైతులు దిగులు చెందుతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తేమ పేరుతో కోత విధించడంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. దీంతో ఆరుకాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామంటే సరైన ధర రాకపోవడంతో రైతులు ఇండ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. రోజు రోజుకు పత్తి ధర తగ్గుతున్నది. నెల రోజుల క్రితం క్వింటాల్‌కు రూ.7వేలు ఉంటే ప్రస్తుతం రూ.6500 మించి పలకడం లేదు. సీసీఐ కేంద్రాల్లో (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మద్దతు ధర దక్కకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 1.65 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా అందులో లక్ష క్వింటాళ్ల వరకు ప్రైవేట్ వ్యాపారులే కొనుగోలు చేశారు. జిల్లాలో ఈ సంవత్సరం 1.08లక్షల ఎకరాల్లో రైతులు పతి పంట సాగు చేశారు.

గత సీజన్లతో పోల్చితే ఈ సారి వాతావరణ పరిస్థితుల కారణంగా పంటసాగులో నష్టం వాటిల్లడంతో తక్కువ దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం పత్తికి గతేడాది రూ.6080 నుంచి రూ.6380 వరకు ఉండగా ఈ సారి ప్రభుత్వం రూ.7020 వరకు నిర్ణయించి కొనుగోలు చేస్తుంది. తేమ శాతాన్ని పరిశీలించిన తర్వాతనే ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభంలో ధరను క్వింటాల్‌కు బహిరంగ మార్కెట్‌లో రూ.7వేల వరకు పలికింది. పత్తి ధర పెరుగుతుందని రైతులు ఆశించినా అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోయాయి. దీంతో ధరలు తగ్గాయని వ్యాపారులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7020 పొందడానికి సీసీఐ కొనుగోలు కేంద్రాలకు వెళ్లి అమ్ముకుందామంటే తేమ పేరుతో అక్కడ రూ.6700మించి ధర రాకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో సిద్దిపేట, తొగుట, దౌల్తాబాద్, కొండపాకలో ఒక్కొక్కటి చొప్పున బెజ్జంకిలో రెండు, హుస్నాబాద్‌లో నాలుగు, గజ్వేల్‌లో ఆరు, చేర్యాలలో ఆరు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఇప్పటి వరకు 65వేల పైచిలుకు క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ప్రైవేట్ వ్యాపారులు తరుగు పేరుతో కొత విధిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది అత్యధికంగా క్వింటాల్‌కు రూ.9వేల వరకు ధర పలకడంతో రైతులు సంతోషంతో విక్రయించారు.

### గజ్వేల్ పరిధిలో ఆరు సీసీఐ కేంద్రాలు

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో అధికారులు ఆరు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్వింటాల్‌కు రూ.7020గా సీసీఐ ధర నిర్ణయించింది. తేమ 8శాతం ఉంటే రూ.7020, 12శాతం వరకు ఉంటే రూ.6700గా ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 18 వేల క్వింటాళ్ల పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేశారు. గజ్వేల్‌లోని నాలుగు మిల్లుల్లో ప్రైవేట్ వ్యాపారులు 28వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ప్రైవేట్ వ్యాపారులు రూ.6400 నుంచి రూ.6700 వరకు ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. గజ్వేల్ పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు పండించిన పత్తి చాలా వరకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచారు.

# పత్తి రైతు పరేషాన్

- ఓ వైపు ధరలేక ఇబ్బందులు పడుతున్న రైతులు
- మరోవైపు అకాల వర్షానికి దెబ్బ తిన్న పత్తిపంట



గాగిల్లాపూర్‌లో ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 10 : తెల్ల బంగారంగా పిలువబడే పత్తి పంట రైతులు తెల్లముఖాలు వేసుకునే విధంగా మారింది. కొన్నేండ్లుగా పత్తి పంట సాగు ద్వారా లాభపడుతున్న రైతుకు ఈ ఏడాది నష్టాలు మిగిల్చింది. ఉమ్మడి మద్దూరు మండలంలో ఈ ఏడాది వర్షాకాలంలో 7650 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. పంట సాగు సమయంలో ఆశాజనకంగా ఉన్న వర్షాలు మధ్యలో ముఖం చాటేశాయి. దీంతో పత్తి పంట ఆశించిన స్థాయిలో ఎదగలేదు. గతంలో కంటే ఈ ఏడాది పత్తి పంట దిగుబడి సగానికిపైగా పడిపోయింది. దీనికితోడు పత్తిపంట సాగుకు పెట్టుబడి ఎక్కువైంది. అరకొరగా పండిన పత్తిని అమ్ముకుందామంటే మార్కెట్‌లో సరైన ధర లేక రైతులు నిరాశ చెందుతున్నారు. గతేడాది బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ. 10వేలకు పైగా ధర పలకగా ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.6వేలలోపే ఉంది. సీసీఐలో క్వింటాల్‌కు రూ. 7020 మద్దతు ధర ఉన్నప్పటికీ నింబంధనల ప్రకారం రైతులు పత్తిని అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో చేసేదేమిలేక బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు పత్తిని అమ్ముకొని నష్టపోతున్నారు.

### శాపంగా మారిన ‘మిగ్‌జాం’ తుఫాన్

మూలిగే నక్కపై తాటిపండు పడిన విధంగా అసలే ధరలేక ఇబ్బందులు పడుతున్న పత్తి రైతులపై మిగ్‌జాం తుఫాన్ ప్రభావం పడింది. ఇటీవల కురిసిన వర్షాలు శాపంగా మారాయి. వర్షానికి పత్తి పంట పూర్తి స్థాయిలో దెబ్బతిన్నది. ఆరుగాలం శ్రమించి పండించిన రైతులు పంట చేతికందే సమయంలో వర్షానికి నష్టం జరిగింది.

## మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించిన మంత్రి ‘పొన్నం’

హుస్నాబాద్, డిసెంబర్ 10: మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దవాఖానకు వెళ్లి పరామర్శించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద దవాఖానకు వెళ్లిన ఆయన మాజీ మంత్రులు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.



యశోద దవాఖానలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

## కోమటిబండ నుంచి పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న గజ్వేల్ సంతోషి పరిషత్ సభ్యులు, పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 10 : కార్తిక ద్వాదశిని పురస్కరించుకుని వనభోజనాల్లో భాగంగా గజ్వేల్ సంతోషి పరిషత్ సభ్యులు గజ్వేల్ నుంచి కోమటిబండ ఉమాసంగమేశ్వరాలయానికి పాదయాత్రగా వెళ్లారు. ఆదివారం గజ్వేల్ సంతోషి పరిషత్ ఆధ్వర్యంలో కోమటిబండ మిషన్ భగీరథ సంప్‌హౌస్ గుట్టపై ఉన్న ఉమా సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తిక వనభోజనాలు నిర్వహించారు. గజ్వేల్ సంతోషిమాత ఆలయం నుంచి కోమటిబండ ఉమా సంగమేశ్వర ఆలయానికి నడిచివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పాదయాత్రను ప్రారంభించారు. హరేరామ నామసంకీర్తనతో పాదయాత్ర ముందుకు సాగింది. పురోహితులు దేశపతి రాజశేఖరశర్మ వైదిక నిర్వహణలో గంగా హారతి, కార్తిక వనభోజనాలు చేశారు. సర్పంచ్ తూం శేఖర్‌పటేల్, గజ్వేల్ పట్టణంతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూపు (A.P., న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657